క్లుప్తంగా

బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా సుందర్‌సింగ్



ఆదోని రూరల్: ఆదోని బార్ అసోసియేషన్ ఎన్నికల్లో సుందర్ సింగ్ ప్యానెల్ బుధవారం విజయం సాధించింది. 264 న్యాయవాదులు ఓటింగ్ కోసం నమోదు చేసుకోగా 236 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఇందులో అధ్యక్షుడిగా పోటీ చేసిన సుందర్‌సింగ్‌కు 141 ఓట్లు పోల్ అవ్వగా అనితాభాయికి 95 ఓట్లు వచ్చాయి. ఉపాధ్యక్షుడు జనార్ధన్‌కు 159 ఓట్లు రాగా, తాయన్నకు 77 ఓట్లు వచ్చాయి. కార్యదర్శిగా సురేంద్రకుమార్‌కు 144 ఓట్లు రాగా లోకేష్‌కుమార్‌కు 92 ఓట్లు వచ్చాయి. కోశాధికారిగా బరిలో ఉన్న లతీఫ్‌అహ్మద్‌కు 151 ఓట్లు రాగా అబ్దుల్‌అన్సారీకి 81 ఓట్లు వచ్చాయని ఎన్నికల అధికారులు, సీనియర్ న్యాయవాదులు శ్రీరాములు, రామలింగ తెలిపారు.

గ్రామాల్లో పోలీసు కవాతు



చిన్నపెండేకల్‌లో కవాతు చేస్తున్న పోలీసులు

ఆదోని రూరల్: ఎన్నికల నేపథ్యంలో గ్రామాల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా మండలంలోని చిన్నపెండేకల్, సాంబగల్, నెట్టేకల్ గ్రామాల్లో కేంద్ర బలగాలతో కలిసి పోలీసులు కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా తాలూకా సీఐ నిరంజన్‌రెడ్డి, అసిస్టెంట్ కమాండెంట్ రమేష్ మాట్లాడుతూ.. ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేలా పోలీసుశాఖ కృషి చేస్తోందని తెలిపారు. ప్రజలు స్వేచ్ఛగా తమ ఓటు హక్కు వినియోగించుకోవాలని సూచించారు. గ్రామాల్లో అల్లర్లు, గొడవలు సృష్టించేవారిని ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్‌ఐలు ఎర్రిస్వామి, చిన్నపీరయ్య, శ్రీనివాసులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ముగిసిన పది పరీక్షలు



పరీక్ష రాసి బయటకు వస్తున్న విద్యార్థులు

ఆదోని సెంట్రల్: ఈ నెల 18వ తేదీ ప్రారంభమైన పదో తరగతి పబ్లిక్ పరీక్షలు బుధవారం ప్రశాంతంగా ముగిశాయి. ఆదోని డివిజన్‌లో రెగ్యూలర్, ప్రైవేట్ విద్యార్థులు 16,246 మంది పరీక్షలు రాశారు. ఆదోని పట్టణంలో 17 పరీక్ష కేంద్రాల్లో 3,456 మంది పరీక్షలకు రాశారు. చివరి రోజు పరీక్ష కేంద్రాల నుంచి విద్యార్థులు ఆనందంతో బయటకు వచ్చారు. విద్యార్థుల కోసం ఎదురు చూస్తున్న తల్లిదండ్రులు స్నేహితులు, ఆత్మీయులు పరీక్షలు ఎలా రాసారంటూ పలకరించారు. స్నేహితులకు బైబై చెప్పి సంతోషంగా ఇంటికి పయనమయ్యారు.

పన్ను వసూళ్లు 85 శాతం పూర్తి

చిప్పగిరి: మండలంలో పన్ను వసూళ్లు 85 శాతం పూర్తయినట్లు ఈఓపీఆర్డీ బాలన్న తెలిపారు. బుధవారం మండలంలోని నేమకల్లు గ్రామంలో ఇంటి, కుళాయి, వాణిజ్య సముదాయాలు తదితర వాటికి సంబంధించి పన్నులు వసూలు చేసి రిసిప్ట్‌లను ప్రజలకు అందించారు. ఇప్పటివరకు అన్ని రకాల పన్నులు మొత్తం కలిపి రూ.10,70,938 వసూలుకాగా ఈ మొత్తాన్ని ట్రెజరీకి జమ చేసినట్లు తెలిపారు. ఈ నెలాఖరు కల్లా వంద శాతం పన్ను వసూలు చేస్తామన్నారు. ప్రజలు పన్ను సకాలంలో చెల్లించి అభివృద్ధికి సహకరించాలని కోరారు.

కేజీబీవీ తనిఖీ

చిప్పగిరి: కేజీబీవీ పాఠశాలలో విద్యనభ్యసిస్తున్న ప్రతి విద్యార్థి పరీక్షలలో ఉత్తమ ఫలితాలు సాధించాలని, వంద శాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా సిబ్బంది పనిచేయాలని జీసీడీఓ సునీత ఆదేశించారు. ఆమె బుధవారం స్థానిక కేజీబీవీ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో వసతులు, అందిస్తున్న భోజనం తదితర వాటి గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. మెనూ తప్పక పాటించాలని ఆదేశించారు. ఎస్‌ఓ సౌజన్య, సిబ్బంది ఉన్నారు.

11 వరకు ఎల్లెల్సీకి నీరు

హొళగుంద: కర్ణాటకలోని టీబీ డ్యాం నుంచి తుంగభద్ర దిగువ కాలువ (ఎల్లెల్సీ)కు నీటి విడుదలను ఏప్రిల్ 11 వరకు కొనసాగించనున్నట్లు సాగునీటి సంఘం మాజీ అధ్యక్షుడు, తుంగభద్ర రైతు సంఘం నాయకుడు తెప్పెట రామిరెడ్డి బుధవారం తెలిపారు. టీబీ బోర్డు అధికారులు ఏప్రిల్ 5 వరకు నీటిని విడుదల చేసేందుకు నిర్ణయం తీసుకున్నారని అయితే జిల్లా ప్రజల తాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని మరికొద్ది రోజులు పొడిగించాలని కోరగా సానుకూలంగా స్పందించి గడువు పెంచినట్లు తెలిపారు. ఇదిలా ఉండగా బుధవారం టీబీ డ్యాంలో 1581.32 అడుగుల మేర 5.148 టీఎంసీల నీరు నిల్వ ఉండగా.. ఇన్‌ఫ్లో జీరో, అవుట్ ఫ్లో 911 క్యూసెక్కులున్నట్లు అధికారులు తెలిపారు. ఎల్లెల్సీ ఏపీ బార్డర్ 250 కి.మీ వద్ద 480 క్యూసెక్కుల నీరు ప్రవహిస్తోంది.

ప్రగతి బాట

- దశాబ్దాల రోడ్డు సమస్యకు పరిష్కారం
- రూ.3 కోట్లతో పనులు పూర్తి
- సంతోషం వ్యక్తం చేస్తున్న చింతకుంట, పల్లెపాడు గ్రామస్తులు



నాడు : పల్లెపాడు వద్ద గుంతల మయంగా రోడ్డు,



నేడు: పల్లెపాడు మీదుగా వేసిన తారు రోడ్డు



నాడు : చింతకుంట గ్రామం వద్ద రోడ్డు దుస్థితి,



నేడు ఇలా..

కోసిగి: దశాబ్దాలుగా రోడ్డు సమస్యలు ప్రజలను వేధిస్తున్నా గతంలోని పాలకులకు పట్టలేదు. మాలపల్లి నుంచి పల్లెపాడు,చింతకుంట గ్రామాల మీదుగా కోసిగి వరకు పాతికేళ్లుగా శిథిలమైన రోడ్డుపై ప్రయాణం చేయలేక ప్రజలు నరకయాతన అనుభవించారు. సమస్యను పరిష్కరించాలని పలుమార్లు నాటి ప్రభుత్వానికి, అధికారులకు మొరపెట్టుకున్నా ఫలితం లేకోయింది. అధ్వానంగా తయారైన రోడ్డుపై ప్రయాణం సాధ్యం కాదని ఆర్టీసీ తన దారి మళ్లించి మాలపల్లి నుంచి డి.బెళగల్ మీదుగా నడిపిందంటే పరిస్థితి తీవ్రతను అర్థం చేసుకోవచ్చు. దీంతో చింతకుంట, పల్లెపాడు ప్రజలు కాలినడకన, ప్రైవేటు వాహనాలను ఆశ్రయించాల్సి వచ్చింది. అత్యవసరమై ఆ దారిలో ఆటో, బైక్‌లపై వెళ్తే పంక్చర్లు అయ్యేవి. దీంతో ఆ దారిలో వెళ్లడానికి వాహనదారులు జంకేవారు. ఎన్నికల సమయంలో ఆయా గ్రామాల ప్రజలు వై.బాలనాగిరెడ్డి దృష్టికి తీసుకెళ్లి రోడ్డు వేయంచాలని విన్నవించారు. ఎన్నికల్లో ఎమ్మెల్యేగా గెలిచిన తరువాత రోడ్డు నిర్మాణానికి కాంట్రాక్టర్లు ముందుకు రాలేకపోయారు. దీంతో కొద్దిగా ఆలస్యమైనా ప్రజలకు ఇచ్చిన మాట తప్పకూడదని ప్రత్యేక నిధులు రూ.3 కోట్లు వెచ్చించి మాలపల్లి నుంచి కోసిగి వరకు 9.2 కి.మీ. రోడ్డు పీటీఆర్ కన్‌స్ట్రక్షన్ ఆధ్వర్యంలో పనులు మొదలు పెట్టారు. ఈ ఏడాది జనవరి 27న మాలపల్లి నుంచి కోసిగి వరకు రోడ్డు పనులకు భూమి పూజ చేసి ప్రారంభించారు. రెండు నెలలు పూర్తి కాక మునుపే రోడ్డు పనులను పూర్తి చేయించి ఇచ్చి మాటను నిలబెట్టుకున్నారు. దీంతో 25 ఏళ్లుగా అపరిష్కృతంగా నిలిచిపోయిన సమస్యకు పరిష్కారం లభించడంతో ఆయా గ్రామాల ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

రోడ్డు కష్టాలు తీర్చారు



మాది చింత కుంట గ్రామం. చాల కాలంగా గ్రామానికి రోడ్డు వసతి లేక కంకర తేలిన రోడ్డుపై ప్రయాణం చేయలేక నరకయాతన అనుభించాం. రోడ్డు సరిగా లేక పోవడంతో మా గ్రామం మీదుగా వెళ్లే ఎమ్మిగనూరు డిపో బస్సు సర్వీసును రెండేళ్లుగా రద్దు చేశారు. నాటి నుంచి తీవ్ర ఇబ్బందులు పడ్డాం. ప్రస్తుతం రోడ్డు నిర్మించడంతో రహదారి కష్టాలు తప్పాయి. – చిన్నోడు, చింతకుంట

రోడ్డు బాగు చేశారు



మాది పల్లెపాడు గ్రామం. మాగ్రామం నుంచి కోసిగికు 8 కి.మీ. దూరం ఉంది. గతంలో ఏ పనికి వెళ్లాలన్నా మండల కేంద్రం వెళ్లాల్సిందే. రోడ్డు వసతి సరిగ్గా లేక పోవడంతో బస్సులు కూడా రద్దు రేశారు. మా గ్రామం నుంచి రెండు కి.మీ. దూరంలోనున్న మాలపల్లి వరకు వెళ్లి అక్కడ నుంచి బస్సులకు వెళాల్సి వచ్చేది. మా గ్రామాల ప్రజలు పడుతున్న ఇబ్బందులను గుర్తించి ఎమ్మెల్యే సొంత నిధులు వెచ్చించి రొడ్డు వసతి వసతి వేయించారు. మాగ్రామానికి సుందరంగా రోడ్డు తయారైంది. ఎమ్మెల్యేకు మా గ్రామ ప్రజలు తరుపున రుణపడి ఉంటాం. – కోతి నరసింహులు, పల్లెపాడు

భారీగా పెరిగిన మిర్చి దిగుబడులు



ఆదోని మార్కెట్ యార్డుకు వచ్చిన మిర్చి దిగుబడులు

ఆదోని అర్బన్: ఆదోని వ్యవసాయ మార్కెట్‌యార్డులోని ఎండుమిర్చి యార్డుకు రైతులు భారీగా ఎండుమిర్చి బస్తాలను తీసుకొచ్చారు. బుధవారం 4,436 బస్తాల మిర్చిని అమ్మకానికి తీసుకురాగా, గరిష్టంగా రూ.13,511, మధ్య రూ.10,500, కనిష్ట రూ.3100గా నమోదయ్యాయి. ఇందులో భాగంగా 10 రకాల ఎండుమిర్చిని రైతులు యార్డుకు తీసుకొచ్చారు. బ్యాడిగి రకం గరిష్టంగా రూ.10,509, కడ్డీ బ్యాడిగ రూ.6801, డీలక్స్ రకం రూ.8811, లాలీ రకం రూ.9100, తేజ రకం రూ.13,511, సింజెంట రకం రూ.7509, డబ్ల్యూ బ్యాడిగి రూ.11,319, సూపర్–10 రూ.8180, 5531 రకం రూ.8250, తాలు రకం రూ.9811 పలికింది.

జగనన్నతోనే సంక్షేమ పాలన



దుద్ది గ్రామంలో ప్రచారం చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

కోసిగి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డితోనే సంక్షేమ పాలన కొనసాగుతుందని వైఎస్సార్‌సీపీ మండల ఇన్‌చార్జ్ పి.మురళీమోహన్ రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని దుద్ది, కొల్మాన్‌పేట, ఆర్లబండ గ్రామాల్లో ఇంటింటికీ తిరిగి ప్రచారం చేసి ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి ఎమ్మెల్యేగా వై.బాలనాగిరెడ్డిని గెలిపించాలని కోరారు. ఆయన మాట్లాడుతూ ఐదేళ్లుగా రాష్ట్రంలో సుభిక్ష పాలన సాగిందని గుర్తుచేశారు. ప్రభుత్వ సేవలన్నీ గ్రామంలోనే అందేలా చర్యలు చేపట్టారని, సంక్షేమ పథకాలు ఇంటికే అందుతున్నాయంటే అది జగనన్న తీసుకున్న చర్యలేనన్నారు. పల్లెల్లో నాణ్యమైన వైద్యసేవలందించేందుకు ప్రభుత్వ ఆధ్వర్యంలో ఆసుపత్రులను ఏర్పాటు చేసి డాక్టర్లను నియమించి ఆధునిక వైద్య యంత్రాలు, మందులు అందుబాటులో ఉంచారన్నారు. మరింత సంక్షేమాభివృద్ధి చేకూరాలంటే వచ్చే ఎన్నికల్లో జగనన్నను మరోసారి ముఖ్యమంత్రిగా గెలిపించుకుందామని కోరారు. స్థానిక నాయకులు పాల్గొన్నారు.

దరఖాస్తు గడువు పొడిగింపు

కౌతాళం: ఉచిత విద్యకు దరఖాస్తుల గడువును ప్రభుత్వం ఈనెల 31వ తేదీ వరకు పొడిగించినట్లు ఎంఈఓ శోభరాణి తెలిపారు. బుధవారం ఆమె మాట్లాడుతూ మండలంలోని ప్రైవేట్ పాఠశాలల్లో విద్యా హక్కు చట్టం కింద జిల్లా విద్యాశాఖ అధికారుల ఆదేశాల మేరకు ఉచిత విద్యకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు చెప్పారు. 2024–25 విద్యా సంవత్సరానికి మండలంలోని ప్రతికూల పరిస్థితిని ఎదురుకుంటున్న అనాథలు, హెచ్‌ఐవీ బాధితులు, విభిన్న ప్రతిభావంతులు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, ఓసీ వర్గాల పిల్లలకు వారి సమీప ప్రాంతాల్లోని ప్రైవేట్ పాఠశాల్లో ఒకటో తరగతిలో 25 శాతం కోటా కింద ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. అర్హులైన విద్యార్థులు ఆధార్‌కార్డు, ప్రాథమిక వివరాలతో ఆన్‌లైన్‌లో ఈనెల 31వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. లాటరీ విధానం ద్వారా సీట్లు కేటాయిస్తామని, అర్హులైన విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ప్రచారాలకు అనుమతి తప్పనిసరి

- అందరూ ఎన్నికల నియమావళి పాటించాల్సిందే
- ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా సహకరించండి
- రాజకీయ పార్టీ నేతలతో సబ్‌కలెక్టర్ శివనారాయణశర్మ



రాజకీయ నాయకులు, ప్రజాప్రతినిధులతో మాట్లాడుతున్న సబ్‌కలెక్టర్ శివనారాయణశర్మ

ఆదోని రూరల్: రాజకీయ పార్టీల ప్రచారాల కోసం ముందస్తు అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని ఆదోని ఎన్నికల అధికారి, సబ్ కలెక్టర్ శివనారాయణశర్మ అన్నారు. బుధవారం తన కార్యాలయంలో ఎన్నికల ప్రవర్తనా నియమావళిపై రాజకీయ పార్టీ ప్రతినిధులు, సంబంధిత అధికారులతో సమీక్షించారు. నియోజకవర్గంలో ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరగడానికి రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలని కోరారు. కేంద్ర ఎన్నికల సంఘం నియమావళి ప్రకారం అసెంబ్లీ నియోజకవర్గానికి పోటీ చేసే అభ్యర్థి రూ.40 లక్షలు మించి ఖర్చు చేయరాదని తెలిపారు. అభ్యర్థులు ప్రచార నిమిత్తం వినియోగించే బ్యానర్లు, జెండాలు, టోపీలు, ప్రకటనలకు సంబంధించిన రేట్ ఇవ్వడం జరిగిందన్నారు. సంబంధిత రేటింగ్ కార్డు ప్రకారమే అనుమతి తీసుకుని ప్రచారం నిర్వహించుకోవాలని సూచించారు. సభలు, సమావేశాలు నిర్వహించాలనుకుంటే 48 గంటల ముందే అనుమతి తీసుకోవాలన్నారు. ఎంసీసీ, ఫ్లయింగ్ స్క్వాడ్, వీడియో వ్యూయింగ్ టీంలు నియోజకవర్గంలో పర్యవేక్షిస్తుంటాయని తెలిపారు. ఈసారి నూతనంగా 48 గంటల ముందు ఇంటింటి ప్రచారం చేసే ప్రాంతాలపై ముందస్తు అనుమతి తీసుకోవాల్సి ఉంటుందని అన్నారు. అయితే ఈ విషయంపై రాజకీయ పార్టీల ప్రతినిధులు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ విషయంపై పునరాలోచన చేయాలని జిల్లా ఎన్నికల అధికారికి, ఎన్నికల సంఘానికి రాజకీయ పార్టీల ప్రతినిధుల తరపున వినతి అందజేయాలని కోరారు. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థి ఎన్నికల సంఘం సూచించిన మేరకే ఖర్చు చేయాల్సి ఉంటుందని, ఈ మేరకు ఖర్చు చేసే వ్యయాన్ని లెక్క కట్టి ఏ రోజుకారోజు నివేదికలను ఇవ్వాలని సూచించారు. బహిరంగ సభలు, ర్యాలీలు, ప్రకటనలు, పోస్టర్లు, బ్యానర్లు, వాహనాలు, ఆహార పదార్థాల ఖర్చులు సహా లెక్కించాలన్నారు. రూ.10 లక్షలకు మించి లావాదేవీలు జరిగితే ఇన్‌కమ్ ట్యాక్స్ అధికారులకు తెలియజేయాలన్నారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి, మీడియా సర్టిఫికేషన్ మానిటరింగ్ కమిటీ నుంచి వచ్చే ప్రకటనలు, పెయిడ్ న్యూస్‌కు సంబంధించిన వాటిని కూడా లెక్కకట్టి అభ్యర్థుల ఖాతాలో నమోదు చేస్తామని అన్నారు. సమావేశంలో తహసీల్దార్ హసీనాసుల్తానా, డీఎస్పీ శివనారాయణస్వామి, మున్సిపల్ అసిస్టెంట్ కమిషన్ అనుపమ, ఎలక్షన్ డీటీ రామేశ్వరరెడ్డి, ఎంపీడీఓ విజయ్‌శేఖర్ పాల్గొన్నారు.

ప్రింటింగ్ ప్రెస్ నిర్వాహకులు నిబంధనలు పాటించాలి



ప్రింటింగ్ ప్రెస్ యజమానులకు సూచనలు చేస్తున్న సబ్‌కలెక్టర్

ఎన్నికల దృష్ట్యా ప్రింటింగ్ ప్రెస్ నిర్వాహకులు ఎన్నికల సంఘం నిబంధనలు పాటించాలని సబ్‌కలెక్టర్ శివనారాయణశర్మ అన్నారు. బుధవారం తన చాంబర్‌లో ఆదోని ప్రింటింగ్ ప్రెస్ అసోసియేషన్, ప్రింటింగ్ ప్రెస్ యాజమాన్యంతో సమావేశం నిర్వహించారు. పోస్టర్లు, ఫ్లెక్సీలు, పాంప్లేట్లు ప్రింట్ చేసే క్రమంలో పాంప్లెట్, పోస్టర్‌పై ప్రింటింగ్‌కు గల కారణం, ప్రింటర్, పబ్లిషర్ పేరు, చిరునామా తప్పనిసరిగా ఉండే విధంగా చూసుకోవాలని సూచించారు. ప్రచురణకర్త సంతకం, సెల్ఫ్ డిక్లరేషన్ తీసుకోవాలన్నారు. ఎన్నికల సంఘం నిబంధనలకు లోబడి ప్రింటింగ్ చేసుకోవాలని తెలిపారు. అతిక్రమిస్తే సెక్షన్ 127(1) (2) ప్రకారం ఆరు నెలల జైలు శిక్ష, రూ.2 వేల జరిమానా లేదా రెండూ వర్తించే అవకాశం ఉందన్నారు. ప్రింటర్ ముద్రించిన మూడు రోజుల్లోపు ప్రచురణకు సంబంధించిన డిక్లరేషన్‌తో పాటు ప్రింటెండ్ మెటీరియల్ నాలుగు కాపీలు, కాపీల సంఖ్య, ప్రింటింగ్ కోసం వసూలు చేసిన ధరను తెలియజేయాలన్నారు. తహసీల్దార్ హసీనా సుల్తానా, డీఎస్పీ శివనారాయణస్వామి పాల్గొన్నారు.

రమణీయం.. శ్రీరంగనాథుడి రథోత్సవం



జనవాహిని మధ్య శ్రీరంగనాథుడి రథోత్సవం,



స్వామివారి కల్యాణోత్సవం

మద్దికెర: మండల పరిధిలోని పెరవలి గ్రామంలో ప్రసిద్ధి చెందిన శ్రీరంగనాథుడి వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా బుధవారం సాయంత్రం అశేష జనవాహిని మధ్య శ్రీరంగనాథుడి రథోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. ఉదయం స్వామివారి సతీసమేత ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించి అభిషేకం, సహస్ర అష్టోత్తర నామం కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం కల్యాణ మండపానికి పుష్పాలంకరణ, కల్యాణోత్సవానికి దాతలు పారా రామచంద్రప్రసాద్, పారా విశ్వనాథ్ బహుకరించగా నర్సప్ప ఆచారి మంగళ సూత్రాలు సమర్పించారు. పండితుల వేదమంత్రాల సాక్షిగా శ్రీరంగనాథుడు, శ్రీదేవి, భూదేవిల కల్యాణోత్సవం భక్తిశ్రద్ధలతో కనులపండువగా నిర్వహించారు. సాయంత్రం వేదమంత్రోచ్ఛరణలు, మంగళ వాయిద్యాల నడుమ ఉత్సవమూర్తులను ప్రత్యేక పల్లకీలో ఊరేగించి రథంపై కొలువుంచారు. రథం ముందు హోమం కాల్చిన అనంతరం అశేష జనవాహిని గోవింద నామస్మరణతో ఆ ప్రాంతం మార్మోగింది. కనులపండువగా రథోత్సవం సాగింది. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా మద్దికెర పోలీసులు బందోబస్తు నిర్వహించారు. గ్రామస్తులే గాకుండా ఇతర ప్రాంతాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

'మేమంతా సిద్ధం'ను జయప్రదం చేయండి

కోసిగి: ఈనెల 29వ తేదిన ఎమ్మిగనూరులో జరిగే మేమంతా సిద్ధం సభకు మండలం నుంచి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలివచ్చి విజయవంతం చేయాలని వైఎస్సార్ సీపీ మండల ఇన్‌చార్జ్ పి. మురళీమోహన్ రెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం కొల్మాన్‌పేట గ్రామంలో మండల నాయకులతో సమావేశమైయ్యారు. ఆయన మాట్లాడుతూ మండలం నుంచి దాదాపు 3వేల మందితో బయలుదేరి వెళ్లేందుకు బస్సులు సిద్ధం చేసినట్లు తెలిపారు. పార్టీ మండల అధ్యక్షుడు బెట్టన గౌడ, ఎంపీపీ ఈరన్న, జగదీష్ స్వామి, మాణిక్యరాజు. పూల వీరస్వామి, నరసింహులు, నాడుగేని వీరారెడ్డి, బండ్ల గోవిందు ఉన్నారు.

ఆడపిల్లలను సంరక్షించుకుందాం

నందవరం: ఆడపిల్లలను సంరక్షించుకుందామని సీడీపీఓ సఫరున్నీషా బేగం సూచించారు. ఆమె బుధవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్ శ్రీలేఖ ఆధ్వర్యంలో బేటీ బచావో..బేటీ పడావో కార్యక్రమం నిర్వహించారు. ఐసీడీఎస్ నేతృత్వంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, మహిళ పోలీసులు, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లకు, అనంతరం కస్తూర్బా విద్యాలయంలో విద్యార్థినులకు బాలికల సంరక్షణపై అవగాహన కార్యక్రమం చేపట్టారు. వారు మాట్లాడుతూ.. కుమారులతో పాటు కూతుళ్లను సమానంగా పెంచేలా తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని వివరించారు. ఆడపిల్లల చదువు ఆవశ్యకతను వివరించారు. బాలికల ఆరోగ్యం పట్ల ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. పరిశుభ్రత, ఆరోగ్యం, పౌష్టికాహారంతో రక్తహీనత నివారణ వంటి అంశాలను వివరించారు. వైకేపీ ఏపీఎం చిన్నవీరన్న, సీహెచ్‌ఓ బలరాం, హెల్త్ సూపర్‌వైజర్ శ్రీనివాసులు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు సుచరిత, సుధావతి, హెల్త్, వైకేపీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బాల్యవివాహాలు అరికట్టాలి

మద్దికెర: బాలికలకు యుక్త వయసు రాకముందే పెళ్లిళ్లు చేసి వారి జీవితాలు నాశనం చేయవద్దని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సావిత్రిదేవి సూచించారు. బుధవారం స్థానిక కస్తూర్బా విద్యాలయం బాలికలతో బేటీ బచావో –బేటీ పడావో అంటూ ర్యాలీ నిర్వహించి అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ.. లింగ వివక్ష నిర్మూలించాలని, బాలికలను ఉన్నత చదువులు చదివించాలని కోరారు. భ్రూణ హత్యలు అరికట్టాలన్నారు. ప్రిన్సిపాల్ జ్యోతిరెడ్డి, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ సౌభాగ్యలక్ష్మి, కార్యకర్తలు పాల్గొన్నారు.

బాలికల భవితకు కేజీబీవీ బాసట

- కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా సౌకర్యాలు
- పౌష్టికాహారంతో పాటు ఆరోగ్యంపై ప్రత్యే శ్రద్ధ



ఆదోని కేజీబీవీ విద్యాలయం

ఆదోని సెంట్రల్: కస్తూర్బా గాంధీ విద్యాలయాలు కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా అభివృద్ధి చెందుతున్నాయి. నాణ్యమైన విద్య, భోజన వసతితో సకల సదుపాయాలు ఉన్నాయి. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఆరో తరగతి నుంచి ఇంటర్మీడియెట్ వరకు విద్యా ప్రమాణాలను మెరుగుపరిచారు. బాలికల చదువుకు బాసటగా నిలిచేందుకు 2024–25 విద్యాసంవత్సరానికి కేజీబీవీల్లో అడ్మిషన్ల కోసం రాష్ట్ర ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసింది. ఆదోని పట్టణం రెండు కేజీబీవీ ఉన్నాయి. ఒకటి జనరల్ కేజీబీవీ, మరోకటి ముస్లిం మైనార్టీల పాఠశాల. ఇక్కడ మెరుగైన విద్యాబోధనలు అందిస్తున్నారు. పేద మధ్య తరగతి విద్యార్థులు చదివే ఈ విద్యాలయాల్లో సకల సౌకర్యాలను కల్పించారు. అంతర్జాతీయ స్థాయి విద్యా ప్రమాణాలు, ఇంగ్లిష్ మీడియంలో బోధన ఇక్కడి ప్రత్యేకత. అనాథలు, బడిబయట బాలికలను ఉన్నతంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా కేజీబీవీలను నడుపుతున్నారు.

దరఖాస్తు చేసుకోవడానికి అర్హతలు

పేద పిల్లలతో పాటు బడి బయట ఉన్న పిల్లలు, బడి మానేసిన వారు, అనాథ, వీధి బాలికలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, బీపీఎల్ బాలికలకు తొలి ప్రాధాన్యత కింద ప్రవేశాలు కల్పిస్తారు. ముఖ్యంగా ఆరో తరగతిలో ప్రవేశం పొందేందుకు గుర్తింపు పొందిన పాఠశాలలో 5వ తరగతి చదువుతూ ఉండాలి. ఏప్రిల్ 11వ తేదీ దరఖాస్తు చేసుకోవడానికి చివరి తేదీ. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. ఆన్‌లైన్‌లో వచ్చిన దరఖాస్తులను మాత్రమే పరిగణలోకి తీసుకుంటారు. విద్యార్థినులు తమ దరఖాస్తులను ఏపీకేజీబీవీ. ఏపీసీఎఫ్‌ఎస్‌ఎస్. ఇన్ వెబ్‌సైట్‌లో పూర్తి వివరాలను ఎంటర్ చేసి దరఖాస్తు చేసుకోవాలి. ఆయా పాఠశాలల్లోని నోటీస్ బోర్డులో ఎంపికైన విద్యార్థినుల వివరాలు ఉంచుతారు.


ఆరు నుంచి ఇంటర్ వరకు అన్నీ ఉచితమే

అడ్మిషన్లు పొందే విద్యార్థినులకు ఆరు నుంచి ఇంటర్ వరకు ఉచితంగా చదువుకునే అవకాశం కల్పిస్తారు. బాలికలకు ఉచిత విద్యతో పాటు భోజనం, వసతి సౌకర్యాలను కల్పిస్తారు. పాఠ్యపుస్తకాలు, యూనిఫాం, కాస్మొటిక్ చార్జీలను అందజేస్తారు. రోజు పోషక విలువలతో కూడిన రుచికరమైన భోజనం వడ్డిస్తారు. ప్రత్యేక అధికారి నుంచి ఉపాధ్యాయులు, వాచ్‌మన్, స్వీపర్లు వరకు అందరూ మహిళలే ఉంటారు. కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా విద్యాబోధన ఉంటుంది.

సీట్లు ఇలా ఉన్నాయి.

ఆదోని కేజీబీవీ జనరల్ విద్యాలయంలో 6వ తరగతిలో 40 సీట్లు ఉన్నాయి. ఇంటర్మీడియెట్‌లో ఎంపీసీలో 40 సీట్లు ఉన్నాయి. ఆదోని ముస్లిం మైనార్టీ కేజీబీవీలో 6వ తరగతిలో 40 సీట్లు ఉన్నాయి. ప్రస్తుతం ఇంటర్ రిటైల్ మేనేజ్‌మెంట్ కోర్సులో 40 సీట్లు ఉన్నాయి. అయితే విద్యార్థినుల ఇష్టాలకు అనుగుణంగా బైపీసీ లేదా ఎంపీహెచ్‌డబ్ల్యూ (ఏఎన్‌ఎం) కోర్సులను కూడా పరిగణలోకి తీసుకుని అమలు చేయాలని ప్రపోజల్ పెట్టారు. ఆ కోర్సులు వస్తే 40 చొప్పున సీట్లు ఉంటాయి.

సద్వినియోగం చేసుకోండి



రాష్ట్ర ప్రభుత్వం కేజీబీవీల్లో అన్ని మౌలిక సదుపాయాలను కల్పించింది. 2024–25 విద్యాసంవత్సరానికి ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేశారు. పేద, మధ్య తరగతి విద్యార్థినులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోండి. దరఖాస్తు చేసుకోవడానికి ఏప్రిల్ 11వ తేదీ వరకు సమయం ఉంది. అనాథ బాలికలు, బడిబయట ఉన్న బాలికలను గుర్తించి పాఠశాలల్లో చేర్పిస్తే బాగుంటుంది. –అంజలీదేవి, ప్రిన్సిపాల్, ముస్లిం మైనార్టీ విద్యాలయం ఆదోని

ఇస్వి కొండల్లో చిరుత సంచారం?

ఆదోని సెంట్రల్: ఆదోని పట్టణం సమీపంలోని ఇస్వి కొండల్లో చిరుత సంచారం చేస్తున్నట్లు ఇస్వి గ్రామస్తులు చర్చించుకుంటున్నారు. బుధవారం గొర్రెలను మేపడానికి కొందరు కాపరులు కొండ ప్రాంతానికి వెళ్లగా చిరుతను చూసినట్లు చెబుతున్నారు. కేకలు వేయగా పారిపోయిందని తెలిపారు. ఈ విషయం ఫారెస్టు అధికారులకు తెలియడంతో ఫారెస్టు రేంజ్ అధికారి తేజశ్విని సిబ్బందిని పంపి చిరుత జాడ కోసం గాలింపు చర్యలు చేపట్టారు. చిరుత సంచారంపై ఎలాంటి ఆనవాళ్లు దొరకలేదన్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అటవీ అధికారులన్నారు.